
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 14 । అక్టోబర్ । 2023



సోమశిలలో నీటి నిల్వ

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారం 30.245 టీఎంసీలు ఉన్నాయి. 1132 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా) -	రూ.60,050
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,422
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,585
నవర (8 గ్రా) -	రూ.44,680

గరిష్టం/కనిష్టం
36.4 /26.0

వాతావరణం

శుక్రవారం తేమ 62 శాతం ఉంది. శనివారం జిల్లా వ్యాప్తంగా వేడి వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

పోలీసుల సంక్షేమమే ప్రథమ కర్తవ్యం

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): శాంతిభద్రతల పరిరక్షణలో అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్న పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యమని ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డేను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని పోలీసు సిబ్బంది నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని పరిశీలించి ఆరోగ్య, వృత్తి పరమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు అంకిత భావంతో విధులు నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించరాదని, అనవసరంగా, అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరై క్రమశిక్షణ చర్యలకు గురికావద్దని సూచించారు. ఏఎస్పీ డీ హిమవతి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చిన గంధ మహోత్సవం



దర్గాకు గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న ముజావర్లు

వెంకటాచలం: కసుమూరులోని మస్తానవలి దర్గాలో చినగంధ మహోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 9 గంటలకు చందన్‌మహల్ నుంచి గంధాన్ని తీసుకుని ముజావర్లు మేళతాళాల నడుమ ఊరేగింపుగా దర్గాకు చేరుకున్నారు. అనంతరం మస్తాన్‌వలి సమాధి వద్ద కడప పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేనీ తహలీల్ ఫాతేహా నిర్వహించి గంధాన్ని లేపనం చేశారు. అనంతరం దర్గా ముజావర్లు గంధం, ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండు యూనిట్లలో మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతోందని ఆ ప్రాజెక్ట్ ఇంజినీర్లు శుక్రవారం తెలిపారు. టర్బైన్‌లో సమస్యతో మూడో యూనిట్లో ఉత్పత్తి నిలిచిపోయింది. ఒకటో యూనిట్‌లో 410, రెండో యూనిట్లో 590 మెగావాట్ల చొప్పున విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని ప్రాజెక్టు ఇంజినీర్లు వెల్లడించారు.

తొందరపడి నాట్లు వేయొద్దు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రైతులు తొందరపడి నాట్లు వేయొద్దని ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణమోహన్ శుక్రవారం తెలిపారు. సోమశిల రిజర్వాయర్‌లో డెడ్ స్టోరేజీకి మినహాయించి 20 టీఎంసీల నీరు మాత్రమే ఉందన్నారు. తాగునీటి అవసరాలకు 12 టీఎంసీలు పోగా 8 టీఎంసీలు మాత్రమే లభ్యత ఉంటుందని అంచనా వేశామన్నారు. సోమశిల రిజర్వాయర్‌లో చేరే నీటి పరిమాణాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నెలలో నిర్వహించే సాగునీటి సలహా మండలి సమావేశంలో తొలికారు పంటకు సాగునీరందించే విషయాన్ని నిర్ణయిస్తామని చెప్పారు. అప్పటి వరకు వేచి ఉండాలని సూచించారు.

నేటి నుంచి పాఠశాలలకు దసరా సెలవులు

నెల్లూరు (టౌన్): విజయదశమిని పురస్కరించుకుని జిల్లాలోని పాఠశాలలకు శనివారం నుంచి 24వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు డీఈఓ గంగాభవాని శుక్రవారం తెలిపారు. దసరా సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ ఆదేశాలను పాటించాలన్నారు.

ఇన్‌స్టెంట్ పరీక్షల దరఖాస్తుకు నేడు తుది గడువు

వెంకటాచలం: విక్రమసింహపురి వర్సిటీ(వీఎస్‌యూ) ఇన్‌స్టెంట్ పరీక్షల దరఖాస్తు గడువు శనివారంతో ముగియనుందని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి ఆర్ ప్రభాకర్ శుక్రవారం తెలిపారు. 2020 డిగ్రీ ఐదో సెమిస్టర్ (రెగ్యులర్)లో బ్యాక్‌లాగ్స్ కలిగిన విద్యార్థులు అర్హులని చెప్పారు. ఈ నెల 17 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. అన్ని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఇన్‌స్టెంట్ పరీక్షల సమాచారాన్ని విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు.

పార్టీ శ్రేణులకు అండగా ఉంటాం



వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తనను సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారని, 2019 ఎన్నికల్లోనూ తనకు అండగా ఉండి గెలిపించారని, వారికి రుణపడి ఉంటానన్నారు. పార్టీలోని ప్రతిఒక్కరికీ అండగా ఉంటామన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగిద్దామని పిలుపునిచ్చారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ మన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేద్దామన్నారు. మన ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళదామన్నారు. తారతమ్య భేదాలు లేకుండా అందరం ఒక్క తాటిపై పార్టీ గెలుపు కోసం పనిచేద్దామన్నారు.

కష్టపడి పనిచేద్దాం



ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం అందరం కష్టపడి పార్టీ కోసం పనిచేస్తున్నామని, అదే విధంగా రానున్న రోజుల్లో కూడా పార్టీ గెలుపు కోసం పనిచేద్దామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం తీసుకుంటున్న నిర్ణయాలు చాలా గొప్పగా ఉంటున్నాయన్నారు. పార్టీ తరఫున పోటీ చేస్తున్న ప్రతిఒక్కరిని గెలిపించుకుందామన్నారు.

చరిత్రను తిరగరాద్దాం



నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన నెల్లూరు నగర నియోజకవర్గ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి

- జిల్లాలోని అన్ని స్థానాల్లో అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం
- పార్టీ పునాదులు పటిష్టం చేసుకుందాం
- దొంగ ఓట్లను అరికడదాం
- ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను ఎండగడదాం
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి
- నెల్లూరు నగరం, ఉదయగిరి, సర్వేపల్లి, కావలి నియోజకవర్గాలపై సమీక్ష

నెల్లూరు(సెంట్రల్): రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా సమష్టిగా పనిచేసి జిల్లాలోని అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుని చరిత్రను తిరగరాద్దామని ఆ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డి అన్నారు. నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నెల్లూరు నగర, ఉదయగిరి, సర్వేపల్లి, కావలి నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, నాయకులతో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని స్థాపించినప్పటి నుంచి మనందరం పార్టీ కోసం పనిచేస్తున్నామన్నారు. పార్టీలో క్రమశిక్షణతో నడుచుకున్నప్పుడే అందరి ప్రతిష్ట పెరుగుతుందన్నారు. మనందరం ప్రజల అభిమానాన్ని చూరగొని తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. ముందుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేసిన పునాదులను మనందరం కలసి పటిష్టం చేసుకుందామన్నారు. మనందరి ధ్యేయం ఒక్కటిగా పనిచేసి ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీని రాబోయే ఎన్నికల్లో తిరిగి గెలిపించుకోవడమేనన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తల కృషి చాలా గొప్పదని కొనియాడారు. ప్రతిపక్షాల ఆరోపణలు, అసత్యాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. దొంగ ఓట్లను తొలగించేలా, అర్హులైన వారు ఓటు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. 87 శాతం మంది ప్రభుత్వం నుంచి ఏదో ఒక విధంగా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారన్నారు. అదే విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు.

జిల్లాకు రాజకీయంగా ప్రత్యేక స్థానం

మొదటి నుంచి జిల్లాకు రాజకీయంగా ప్రత్యేక స్థానం ఉందని విజయసాయిరెడ్డి గుర్తుచేశారు. జిల్లాలో నగదుకు ప్రాధాన్యత లేదని, నిజాయతీతో ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లో రాణిస్తుంటారన్నారు. జిల్లా రాజకీయాల్లో ఎవరూ సంపాదించింది లేదన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీకి కంచుకోటలా ఉందని, తిరిగి అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. మహిళలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని గుర్తుచేశారు.

సమష్టిగా పనిచేద్దాం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం ప్రతిఒక్కరం కలసి పనిచేద్దామన్నారు. మనందరి ధ్యేయం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవడమే అన్నారు. ప్రతి ఒక్కరం ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళదామన్నారు. పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతిఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళదాం

తిరుపతి ఎంపీ ఎం గురుమూర్తి మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళదామన్నారు. ఎక్కడా పొరపాటు లేకుండా ప్రతిఒక్కరం కష్టపడి పార్టీ కోసం పనిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకులు కోడూరు కల్పలత మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులైన వారందరికీ అందిస్తున్నామన్నారు. మనందరి ధ్యేయం వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవడం, తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవడమేనని అన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం

నెల్లూరు నగర నియోజకవర్గ పరిశీలకుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. రైతాంగానికి అన్ని విధాలా అండగా నిలుస్తున్నారన్నారు. జిల్లాలోని అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమన్నారు.

అవినీతికి తావులేని పాలన



కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో అవినీతికి తావులేని సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. కావలి నియోజకవర్గంలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేశామన్నారు. రైతాంగంతో పాటు అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సమస్యలను పరిష్కరించుకుని అందరం కలసికట్టుగా పనిచేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు.

నాకు రాజకీయ భిక్ష పెట్టింది జగనన్నే



నెల్లూరు నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ కోసం మరింత ఉత్సాహంతో పనిచేద్దామన్నారు. నెల్లూరు నగరం నుంచి ప్రతిపక్షంలో ఎవరు పోటీ చేసినా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిదే గెలుపన్నారు. నాకు రాజకీయం అనేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెట్టిన భిక్ష అన్నారు. అందరం కలిసికట్టుగా పోరాడి పార్టీని గెలిపించి తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు.

గడప గడపకు ద్వారా ప్రజల్లోకి..



ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గడప గడపకు కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్తున్నామన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో అందరం కలసికట్టుగా తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు.

సంక్షేమం, అభివృద్ధిలో ముందడుగు

నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిలో మన రాష్ట్రం ముందుందన్నారు. అన్ని రాష్ట్రాలు మన రాష్ట్రం వైపు చూస్తున్నాయన్నారు. ప్రధానంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఎంతో గొప్పగా పనిచేస్తున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారని కొనియాడారు.





నెల్లూరు నగర నియోజకవర్గ సమీక్ష సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు



విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆనం జయకుమార్‌రెడ్డి

ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం



సింహపురి సేంద్రియ మేళాను ప్రారంభిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- సింహపురి సేంద్రియ మేళా ప్రారంభం

నెల్లూరు(దర్గామిట్ట): రైతు సాధికార సంస్థ ద్వారా రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందజేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, మత్స్యకార సంక్షేమ సమితి, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని వీఆర్సీ మైదానంలో ఏర్పాటు చేసిన సింహపురి సేంద్రియ మేళా–2023ను రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవిచౌదరితో కలసి మంత్రి కాకాణి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం సేంద్రియ వ్యవసాయ, మత్స్య ఉత్పత్తుల స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం కింద అల్లూరి చంద్రశేఖర్ రాజుకు రూ.3.5 లక్షల సబ్సిడీతో రూ.10 లక్షల రుణ చెక్కును మంత్రి అందజేశారు. అనంతరం మంత్రి కాకాణి మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ రైతుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలనే లక్ష్యంతో రైతు సాధికార సంస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ సంస్థ ద్వారా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేస్తున్నారన్నారు. అందులో భాగంగా నెల్లూరులో మూడ్రోజుల పాటు సింహపురి సేంద్రియ మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కోవిడ్ తరువాత చిరు ధాన్యాలు, సేంద్రియ ఉత్పత్తుల వినియోగం పెరిగిందన్నారు. అందుకనుగుణంగా రాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయాన్ని మరింతగా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రకృతి సాగు, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించినందుకు గానూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన జైవిక్ అవార్డు అందుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘ ప్రతినిధి కుమారస్వామి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుధాకర్‌రాజు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఏపీ ఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఎల్డీఎం శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్పత్తులను పరిశీలిస్తున్న మంత్రి కాకాణి

స్పందన అర్జీలు చిత్తశుద్ధితో పరిష్కరించాలి

• జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్

జలదంకి: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ సూచించారు. జలదంకి సచివాలయంలో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్‌తో పాటు కావలి ఆర్డీఓ శీనానాయక్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కూర్మనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్జీల పరిష్కారంలో జవాబుదారీతనం పెంచేందుకు మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. మండలం నుంచి 126 అర్జీలు అందాయని, నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. 90 శాతం అర్జీలు భూ సమస్యలపైనే అందాయని తెలిపారు. జెడ్పీ సీఈఓ బీ చిరంజీవి, డీపీఓ సుస్మితారెడ్డి, డీఆర్డీఏ, డ్వామా పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావ్, హౌసింగ్ పీడీ నాగరాజు, తహసీల్దార్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుడితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్

నేడు కేంద్ర, రాష్ట్ర మంత్రుల పర్యటన

నెల్లూరు(దర్గామిట్ట): సాగర పరిక్రమ యాత్ర ఫేజ్–10లో భాగంగా కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తమ్ రూపాల శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 7 గంటలకు కేంద్ర మంత్రి చెన్నై నుంచి జలమార్గంలో కృష్ణపట్నం పోర్టుకు చేరుకుని సాగర పరిక్రమ యాత్రలో పాల్గొంటారు. అనంతరం కృష్ణపట్నం నుంచి బయలుదేరి ఉదయం 9 గంటలకు నెల్లూరు చేరుకుంటారు. నెల్లూరు వీఆర్సీ మైదానంలో జరుగుతున్న స్టేట్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శిస్తారు. అనంతరం చెన్నైకు బయలుదేరి వెళ్తారు.

రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి పర్యటన

రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్ శాఖల మంత్రి సీదిరి అప్పలరాజు శుక్రవారం రాత్రి నెల్లూరుకు చేరుకున్నారు. శనివారం ఉదయం నెల్లూరు నుంచి బయలుదేరి కృష్ణపట్నం పోర్టుకు చేరుకుంటారు. అక్కడ కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తమ్ రూపాలతో కలసి సాగర పరిక్రమ యాత్రలో పాల్గొంటారు. ఉదయం 9 గంటలకు కేంద్ర మంత్రితో కలసి నెల్లూరు వీఆర్సీ గ్రౌండ్‌కు చేరుకుని ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొంటారు. అనంతరం నెల్లూరు నుంచి చెన్నై వెళ్తారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి దుర్మరణం

అనుమసముద్రంపేట: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన ఏఎస్‌పేట మండలం గుడిపాడు పంచాయతీ రంగన్నపాడులో శుక్రవారం చోటు చేసుకుంది. ఏఎస్సై నజీర్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మందా రవి (45) తనకు సంబంధించిన ఎకరా పొలానికి మోటార్ కింద నారు మడులు పోసి ఉన్నారు. మోటార్ వేసేందుకు పొలం వద్దకు వెళ్తుండగా, అప్పటికే తెగిపడి ఉన్న వైరు ప్రమాదవశాత్తు కాలికి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. గ్రామంలో విషయం తెలియడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి ఏఎస్సై చేరుకొని కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరులోని జిల్లా వైద్యశాలకు తరలించారు. కాగా లైన్‌మెన్ నిర్లక్ష్యంతోనే ఘటన జరిగిందని స్థానికులు ఆరోపించారు.

పట్టాలపై యువకుడి మృతి



నెల్లూరు(క్రైమ్): రైలు పట్టాలపై గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన సౌత్ రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. మృతుడు 30 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగి.. తెలుపు రంగుపై బ్లూ, పింక్ పూల ఫుల్ హ్యాండ్స్ చొక్కా.. బ్లూ రంగు జీన్స్ ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆమె కోరారు.

రైలు ఢీకొని..

రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన వేదాయపాళెం – వెంకటాచలం రైల్వేస్టేషన్ల మధ్య చెన్నై వైపు వెళ్లే పట్టాలపై శుక్రవారం చోటుచేసుకుంది. మృతుడు 25 నుంచి 30 ఏళ్లలోపు వయస్సు కలిగి.. స్కై బ్లూ రంగు ఫుల్‌హ్యాండ్ టీషర్టు, బ్లూ రంగు జీన్స్ ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.5

చుక్కల భూములకు శాశ్వత హక్కులు



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

విడవలూరు: రాష్ట్రంలో పరిష్కారానికి నోచుకోని చుక్కల భూముల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి వాటికి పూర్తి హక్కులను కల్పిస్తూ రైతులకు ధ్రువీకరణ పత్రాలను అందించిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కొనియాడారు. విడవలూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పాస్‌పుస్తకాలను శుక్రవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కోవూరు మండలంలో 2673, విడవలూరు మండలంలో 1687 ఎకరాలకు విముక్తి లభించిందని తెలిపారు. రాష్ట్రంలో ఆర్నెల్లో ఎన్నికలు జరగనున్నాయని, ఇప్పటి వరకు కనిపించని వ్యక్తులు ప్రస్తుతం ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టేందుకు రాష్ట్రంలో పర్యటిస్తున్నారని విమర్శించారు. ఈ నాలుగున్నరేళ్లలో ప్రజల మధ్య ఉండింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలేనని గుర్తుచేశారు. టీడీపీ, ఇతర పార్టీల నేతల మాటలను నమ్మొద్దని కోరారు. తప్పు చేయడంతోనే జైలు జీవితాన్ని చంద్రబాబు అనుభవిస్తున్నారని చెప్పారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు రెండెకరాల నుంచి రూ.నాలుగు లక్షల కోట్ల ఆస్తిని సంపాదించారని, ఇది ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. కోట్లు ఖర్చుపెట్టి ఢిల్లీ నుంచి న్యాయవాదులను తీసుకొచ్చినా బయటకు రాలేకపోతున్నారని తెలిపారు. జెడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, పార్టీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, నేతలు సురేంద్రరెడ్డి, తిరపతి, అయ్యప్ప, పోలయ్య, జనార్దన్‌రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



వైద్య శిబిరానికి వచ్చిన వృద్ధురాలితో మాట్లాడుతున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రజారోగ్యానికి పెద్దపీట వేసి.. ఆరోగ్యంపై ప్రజలకు శ్రద్ధ పెరిగేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పాతూరు అరటితోటలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందుతోందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అరకొర సదుపాయాలతో నిరుపేదలకు వైద్యం అందేది కాదనే అంశాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రుల రూపురేఖలు మారిపోవడంతో పాటు మెరుగైన వైద్యం అందరికీ అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా స్పెషలిస్ట్ వైద్యులు గ్రామాలకే వచ్చి వైద్యపరీక్షలు చేసి మందులను అందిస్తున్నారని వివరించారు. తమది పేదల ప్రభుత్వమని.. వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. అనంతరం శిబిరాన్ని సందర్శించి వైద్యసేవలపై ఆరాతీశారు. కార్యక్రమంలో భాగంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం పలువురికి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, జనిగర్ల మహేంద్ర యాదవ్, పానుగోటి అనూరాధ, మండలి కృష్ణారావు, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, పందిటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు, కనుపర్తి రాజశేఖర్, కాటా శ్రీనివాసులురెడ్డి, కుందుర్తి కామయ్య, నాయబ్ రసూల్, కలగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగిని కాటేసిన విష పురుగు

సంగం: విష పురుగు కాటుకు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని సిద్దీపురం పంచాయతీ మజరా అనసూయనగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. అనసూయనగర్‌కు చెందిన కరకంబాకం విజయ్ (32) కోవూరులోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో భార్యాభర్తలు తమ ఇద్దరు చిన్నారులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మంచంపై విజయ్ నిద్రించారు. ఈ తరుణంలో విష పురుగు కాటేసింది. తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో నిద్ర మేల్కొన్న విజయ్ బాత్‌రూమ్‌కు వెళ్లి వాంతులు చేసుకొని అక్కడే కుప్పకూలిపోయారు. ఎంతసేపటికీ రాకపోవడంతో భార్య వెళ్లి చూడగా, బాత్‌రూమ్‌లో అపస్మారక స్థితిలో విజయ్ పడి ఉండటాన్ని గమనించారు. దీంతో కుటుంబసభ్యులు, చుట్టుపక్కల వారి సాయంతో బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యుల సిఫార్సు మేరకు నెల్లూరు తరలించగా, అప్పటికే విజయ్ మృతి చెందారని నిర్ధారించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై నాగార్జునరెడ్డి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ జిల్లా ఎంపికలు రేపు



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మాస్టర్స్ అథ్లెటిక్స్ జిల్లా స్థాయి ఎంపికలను ఏసీ సుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలో ఆదివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నామని ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి తెలిపారు. దర్గామిట్టలోని నిర్మల సౌధలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రతి విభాగంలో మొదటి మూడు స్థానాల్లో విజేతలను ఎంపిక చేయనున్నామని వివరించారు. తిరుపతిలోని వెంకటేశ్వర వర్సిటీ ఆవరణలో డిసెంబర్ 8 నుంచి పది వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారని పేర్కొన్నారు. సెక్రటరీ కోటీశ్వరమ్మ, జాయింట్ సెక్రటరీ చిన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, హేమంత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ కోర్సుకు స్పాట్ అడ్మిషన్లు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో ఎమ్మెస్సీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ కోర్సుకు స్పాట్ అడ్మిషన్లను ఈ నెల 16 నుంచి 21 వరకు నిర్వహించనున్నామని రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వీఎస్‌యూ ప్రిన్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. వివరాలకు www.vsu.ac.inను సందర్శించాలని సూచించారు.

డీసీసీ అధ్యక్షుడిగా మరోసారి దేవకుమార్‌రెడ్డి



నెల్లూరు(వీఆర్‌సీ సెంటర్): కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా చేవూరు దేవకుమార్‌రెడ్డి రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ ఉత్తర్వులను శుక్రవారం జారీ చేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: రూ.137
లేయర్ (లైవ్)	: రూ.118
బ్రాయిలర్ చికెన్	: రూ.240
స్కిన్‌లెస్ చికెన్	: రూ.262
లేయర్ చికెన్	: రూ.200

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

నెల్లూరు (లీగల్): వ్యక్తిని హత్య చేశారని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో ఆత్మకూరు మండలం మహిమలూరుకు చెందిన మావిళ్ల జయరామయ్య (52)కు జీవిత ఖైదుతో పాటు రూ.100 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి యామిని శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. మహిమలూరుకు చెందిన తోట విజయమ్మ, శ్రీనివాసులు దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వీరికి వివాహాలయ్యాయి. అనారోగ్యంతో శ్రీనివాసులు 2015లో మృతి చెందడంతో కూలీ పనులు చేసుకుంటూ చిన్న అంగడిని పెట్టుకొని ఆమె జీవనం సాగిస్తున్నారు. ఈమె మరిది తోట వెంకటనర్సయ్య భార్యాపిల్లలను వదిలి మహిమలూరులో పక్కింట్లో ఒంటరిగా ఉండేవారు. మద్యం సేవిస్తూ ఎవరి మాటా వినక తిరిగేవారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 27, 2021న కూలీ పనులకెళ్లిన విజయమ్మ మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తిరిగొచ్చారు. మద్యం విక్రయిస్తున్నానంటూ తనపై ప్రచారం చేస్తావా అంటూ వెంకటనర్సయ్యతో జయరామయ్య గొడవపడసాగారు. ఈ క్రమంలో ఇద్దర్నీ విజయమ్మ, చుట్టుపక్కల వారు మందలించి పంపారు. మరుసటి రోజు ఉదయం ఏడు గంటల సమయంలో తలపై రక్త గాయంతో ఇంట్లో వెంకటనర్సయ్య మృతి చెంది ఉండటాన్ని విజయమ్మ గమనించారు. దీనిపై అదే రోజు ఆత్మకూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం జయరామయ్యపై కోర్టులో చార్జిషీట్‌ను పోలీసులు దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పైమేరకు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయ కేసు వాదించారు.

మందుబాబులకు భారీగా అపరాధ రుసుము

నెల్లూరు(క్రైమ్): డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడిన మందుబాబులకు భారీగా అపరాధ రుసుమును న్యాయమూర్తి శుక్రవారం విధించారు. వివరాలు.. స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేట, ఆత్మకూరు బస్టాండ్ తదితర ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను ఇన్‌స్పెక్టర్ బాబీ, సిబ్బందితో కలిసి ఇటీవల నిర్వహించారు. ఇందులో పట్టుబడిన 23 మంది మందుబాబులను రెండో అదనపు మొదటి తరగతి మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు. ఒక్కొక్కరికీ రూ.పది వేల చొప్పున అపరాధ రుసుమును న్యాయమూర్తి శారదారెడ్డి విధించారు.

సంప్రదాయాలు బేఖాతర్



దర్గాలో తహలీల్ ఫాతేహా



నిరసన వ్యక్తం చేస్తున్న ఫయాజ్ అహమ్మద్ వర్గీయులు

- తహలీల్ ఫాతేహా నిర్వహణపై భక్తుల ఆగ్రహం

ఆత్మకూరు / అనుమసముద్రంపేట: అనుమసముద్రంపేటలోని హజరత్ నాయబ్ రసూల్ దర్గాలో గంధ మహోత్సవంలో సంప్రదాయాలను బేఖాతర్ చేశారు. పెద్ద ఉరుసుగా పిలిచే గంధ మహోత్సవానికి జిల్లా నుంచే కాకుండా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. గంధ మహోత్సవం అనంతరం మూడో రోజు నిర్వహించే తహలీల్ ఫాతేహాకు అధిక ప్రాధాన్యం ఉంది. హజరత్ నాయబ్ రసూల్ స్వయంగా వాడిన పూజా సామగ్రి, జపమాలను ప్రదర్శించడం, దాన్ని భక్తులు దర్శించుకోవడం ఆనవాయతీగా వస్తోంది. ఎంతో కాలంగా ఇది కొనసాగుతోంది. అయితే ఈ ఏడాది వక్ఫ్‌బోర్డు అధికారుల నిర్లక్ష్యంతో వాటిని ప్రదర్శించలేదు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. చివరికి ఇవి ప్రదర్శనలో లేవనే విషయాన్ని తెలుసుకొని భక్తులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. వక్ఫ్ బోర్డు ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కోరారు.

తీవ్ర నిరాశకు గురయ్యా



పెద్ద గంధాన్ని చూసేందుకు వారం క్రితం ఇక్కడికి చేరుకున్నా. గంధ మహోత్సవం రోజున గొడవ జరిగింది. పవిత్రమైన తహలీల్ ఫాతేహాలో జపమాలను దర్శించుకునే అవకాశం దక్కలేదు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. – బీబీజాన్, భక్తురాలు

బాధగా ఉంది



గంధ మహోత్సవాన్ని చూసేందుకు ఎంతో ఆశతో వచ్చా. ఫాతేహాలో జపమాలను దర్శించుకుంటే మంచి జరుగుతుందని నమ్మకం. అయితే ఈ రోజు అవకాశం దక్కలేదు. నిరాశతో తిరిగి వెళ్తున్నాం. – షానూ, భక్తురాలు

నిబంధనల మేరకే నిర్వహించాం

ఖాజానాయబ్ రసూల్ కుటుంబసభ్యులు ఇరువర్గాలుగా ఉన్నారు. ఇటీవల గంధాన్ని నిర్వహించే సమయంలో వాదోపవాదాలు జరిగిన విషయం వాస్తవమే. ఉన్నతాధికారులు, పోలీసుల సహకారంతో గంధ మహోత్సవాన్ని జరిపాం. తహలీల్ ఫాతేహానూ నిబంధనల మేరకు నిర్వహించాం. – మహమ్మద్ హుస్సేన్, దర్గా ప్రత్యేకాధికారి

అసభ్యంగా ప్రవర్తించారంటూ ఆందోళన

ముత్తుకూరు: మండలంలోని పిడతాపోలూరులో గల యూపీ స్కూల్ ఉపాధ్యాయుడు బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ ఓ బాలిక తల్లిదండ్రులు, బంధువులు పాఠశాల వద్ద బైఠాయించి ఆందోళనను శుక్రవారం చేపట్టారు. లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఉపాధ్యాయుడిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తామని వారికి నచ్చజెప్పారు. ఈ అంశాన్ని డీఈఓ దృష్టికి తీసుకెళ్లి విచారణ జరిపిస్తామని ఎంఈఓ హేమసుందరరావు హామీ ఇచ్చారు.

బీజేపీ జిల్లా నూతన కమిటీ

నెల్లూరు(బారకాసు): బీజేపీ జిల్లా నూతన కమిటీని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు. కమిటీలో 23 మందిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ ప్రెసిడెంట్లుగా నరసింహనాయుడు, పెంచలయ్య, బత్తల కిష్టయ్య, శ్రీనివాసులు, మాధవి, కృష్ణారెడ్డి, జనరల్ సెక్రటరీలుగా విజయ్‌కుమార్, రాజేష్, బుజ్జిరెడ్డి, యశ్వంత్‌సింగ్‌ను నియమించారు. సెక్రటరీలుగా పరశురామ్, కాసా శ్రీనివాసులు, దాసరి ప్రసాద్, బ్రహ్మానందరెడ్డి, చిలకా ప్రవీణ్, శ్రీజ, ట్రెజరర్‌గా సత్యం నియమితులయ్యారు. యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా అశోక్ నాయుడు, ఓబీసీ జిల్లా అధ్యక్షుడిగా ఫణిరాజు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్‌ను కొనసాగించారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా సుభాషిణి, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఖాదర్‌బాషాను నియమించారు.

సాక్షి ఫ్యామిలీ
నెల్లూరు
శనివారం ॥ 14-10-2023

గర్భవతుల విషయంలో సాధారణ ప్రసవం అనే మాట ఈ రోజుల్లో ఆశ్చర్యంగా మారింది. దేశమంతటా సిజేరియన్ ప్రసవాలు పెరిగాయని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కూడా తన నివేదికల్లో చూపింది. అయితే, ప్రభుత్వ- ప్రైవేట్ ఆసుపత్రులలో నార్మల్, సిజేరియన్ ప్రసవాల సంఖ్యలో తేడా మాత్రం ఉంది. ఈ విషయాన్ని తన సొంత అనుభవంతో గమనించిన ఫిలాంత్రపిస్ట్ డాక్టర్ జాహ్నవి నిలేకని మెటర్నల్ హెల్త్‌కేర్ వైపు దృష్టి సారించింది. బెంగళూరులో మురికివాడల్లోని నగర గర్భిణుల్లో సాధారణ ప్రసవాల గురించి అవగాహన కల్పించడంతో పాటు అస్త్రికా మిడ్‌వైఫరీ పేరుతో ప్రసవాల సెంటర్‌నూ ప్రారంభించింది. సాధారణ ప్రసవం ఆవశ్యకతవైపు వేసిన ఆమె అడుగుల గురించి ఆమె మాటల్లోనే..


డాక్టర్ జాహ్నవి నిలేకని

నార్మల్ డెలివరీలు 'నార్మల్' కావాలి

డాక్టర్ జాహ్నవి నిలేకని

"చదువుకుంటున్నప్పుడే స్వదేశం కోసం ఏదైనా చేయాలనే ఆలోచనలు ఉండేవి. అమ్మ మరాఠీ, నాన్న కొంకణి. పుణేలో పుట్టి, బెంగుళూరులో పెరిగాను. గ్రాడ్యుయేషన్ కోసం అమెరికా వెళ్లాను. నా భర్త యేల్ జార్ఖండ్‌కు చెందినవాడు. ఆ విధంగా నేను ఒకే ఒక ప్రాంతానికి చెందినదానిని అని చెప్పలేను. 2012లో పెళ్లయ్యింది. ప్రెగ్నెంట్‌గా ఉన్నప్పుడు కర్ణాటక లో రీసెర్చ్ చేస్తున్నాను. ఆ సమయంలో నార్మల్ డెలివరీ కోసం నగరాల్లోని చాలా ఆసుపత్రుల వారిని కలిశాను. కానీ, నార్మల్ డెలివరీకి వారెలాంటి హామీ ఇవ్వకపోవడం ఆశ్చర్యమేసింది. మన దేశంలో చాలా రాష్ట్రాల్లో గర్భిణులకు సరైన సమయంలో మందులు, డాక్టర్లు, నర్సుల సేవ అందడం లేదనీ, దీనివల్ల తల్లీ బిడ్డలిద్దరి ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆ సమయంలోనే తెలుసుకున్నాను. ప్రయివేటు ఆసుపత్రులు సిజేరియన్ ప్రసవాన్ని వ్యాపారంలా మార్చేశాయి. జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వే ప్రకారం జమ్మూ, కాశ్మీర్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌లోని 80 శాతం ప్రైవేట్ ఆసుపత్రుల్లో సిజేరియన్ ప్రసవాలు జరుగుతున్నాయి. సి–సెక్షన్ ఆ మహిళకు, బిడ్డకు మంచిది కాదు. నార్మల్ డెలివరీకి అవకాశం ఉన్నప్పటికీ సర్జరీ చేయడం తప్పు. కానీ, వైద్యులు సాధారణ ప్రసవానికి చాలా సమస్యలు చెప్పారు. ఆ విషయంలో నాకు ఎన్నో సందేహాలు తలెత్తాయి. చివరకు హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో నాకు నార్మల్ డెలివరీ అయ్యింది.

దేశమంతటా..

మొదట వాయుకాలుష్యంపై పరిశోధనలు చేస్తూ వచ్చాను. కానీ, బిడ్డ పుట్టాక మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కోసం పనిచేయాలనుకున్నాను. 2019లో అస్త్రికా ఫౌండేషన్‌ను ప్రారంభించాను. దీని ద్వారా భారతదేశం అంతటా ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎమ్‌లు, జీఎన్ఎమ్‌లకు శిక్షణ ఇచ్చాను. దీంతో వారు సురక్షితమైన ప్రసవం గురించి మహిళలకు అవగాహన కల్పించారు. అనవసరమైన సిజేరియన్ ప్రసవాల నుంచి వారిని రక్షించగలుగుతున్నారు.

> మా సెంటర్‌లో మేం ప్రసవానికి మూడు నెలల ముందు నుంచి గర్భిణులకు శిక్షణ, కౌన్సెలింగ్ ఇస్తాం. గర్భిణి ఏం తినాలి, ఎలాంటి వ్యాయామం చేయాలో చెబుతాం. దీనివల్ల నార్మల్ డెలివరీకి భయపడకుండా ఉంటారు.
> – డాక్టర్ జాహ్నవి నిలేకని



ప్రసవ సమయంలో అగౌరవం

ప్రతి గర్భిణి గౌరవప్రదమైన ప్రసూతి సంరక్షణ పొందాలి. కానీ, ఒక గర్భిణికి నొప్పులు వచ్చినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రులలోని లేబర్‌రూమ్‌లో సిబ్బంది ఆమె మీద చెడు మాటలతో విపరీతంగా అరుస్తారు. చెప్పుతో కొట్టడం కూడా చూశాను. ఇది నాకు చాలా పాపం అనిపించింది. ఇలా జరగకూడదు, దీన్ని ఆపాలి అనుకున్నాను. 2021 వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తూ వచ్చాను. అది కూడా సరిపోదని ప్రైవేట్ సెక్టార్ ఆసుపత్రుల్లో అడుగుపెట్టాను. ధనికులైనా, పేదవారైనా ప్రతి స్త్రీకీ మంచి చికిత్స పొందే హక్కు ఉంది. ఇది గుర్తించే, బెంగళూరులోనే ఒక పేరున్న ఆసుపత్రిలో నా ఏడు పడకల కేంద్రాన్ని ప్రారంభించాను. గర్భిణిని కూతురిలా చూసుకునే మంత్రసాని ఉండాలని నమ్ముతాను. విదేశాల నుంచి సర్టిఫైడ్ మంత్రసానులను, వైద్యులను ఈ సెంటర్‌లో నియమించాను. ఎందుకంటే, ఇక్కడ చేరడానికి డాక్టర్లు ఎవరూ రెడీగా లేరు. దీంతో బయటివారిని సంప్రదించాల్సి వచ్చింది. ఆరోగ్య సంరక్షణ బృందాన్ని ఏర్పాటు చేయాలనుకుంటే చాలా ఇబ్బంది అయ్యింది. ఆరోగ్య కార్యకర్తలు కూడా ఎవరూ ముందుకు రాలేదు. ఈ పనిచేయడానికి నాకు చాలా టైమ్ పట్టింది. అంతేకాదు, హాస్పిటల్‌లో ప్లేస్ కోసం కూడా చాలా కష్టపడాల్సి వచ్చింది. నిజానికి ప్రైవేట్ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకంటే సి–సెక్షన్‌లకే ప్రాధాన్యమిస్తుంటారు. ఇక నార్మల్ డెలివరీ అంటేనే మహిళలు, వారి కుటుంబసభ్యులు కూడా భయపడుతున్నారు. వారి దృష్టిలో సిజేరియన్ డెలివరీ సురక్షితమైంది.

కౌన్సెలింగ్‌తో నార్మల్...

నా సంస్థ కర్ణాటక వాణివిలాస్‌లోని అతిపెద్ద ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తోంది. ఓ రోజు హాస్పిటల్ బోర్డ్ మెంబర్ డ్రైవర్ భార్య మా సెంటర్‌కి వచ్చింది. ఆమె నార్మల్ డెలివరీకి భయపడింది. మా మంత్రసాని ఆమె మనసులోని భయాన్ని కౌన్సెలింగ్ ద్వారా తొలగించింది. ఫలితంగా ఆమెకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన సాధారణ ప్రసవం జరిగింది.

మా సెంటర్‌లో మేం ప్రసవానికి మూడు నెలల ముందు నుంచి గర్భిణులకు శిక్షణ, కౌన్సెలింగ్ ఇస్తాం. గర్భిణి ఏం తినాలి, ఎలాంటి వ్యాయామం చేయాలో చెబుతాం. దీనివల్ల డెలివరీ సమయంలో నార్మల్ డెలివరీకి భయపడకుండా ఉంటారు. అంటే, వారికి మానసిక, శారీరక బలాన్ని అందిస్తాం. వారికి సహాయం చేయడానికి మా బృందం ఇరవై నాలుగు గంటలు అందుబాటులో ఉంటుంది. ఈ రెండేళ్లలో 200 మంది గర్భవతులలో కేవలం ఇద్దరికి మాత్రమే సిజేరియన్ అవసరం పడింది. అది కూడా వారికి ప్రసవంలో సమస్య ఉండటం వల్ల. మిగతా అందరికీ సాధారణ ప్రసవాలు జరిగాయి.

అస్త్రికా మిడ్‌వైఫరీ సెంటర్లో ముప్పైమంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. రెండేళ్ల క్రితం ప్రపంచంలో ఉన్న నర్సులు, మంత్రసానుల కోసం అస్త్రికా స్పియర్ పేరుతో డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేశాం. దీని ద్వారా సిబ్బంది అవసరమైన నైపుణ్యాలను నేర్చుకోవచ్చు.

దేశవ్యాప్తంగా దాదాపు రెండువేల మంది సర్టిఫికెట్లు పొందారు. యూరప్ నుంచి కూడా అధ్యాపకులు ఉన్నారు. మా మెటర్నిటీ ఫౌండేషన్ శిక్షణ తీసుకోవాలనుకునేవారికి కోర్సులను కూడా అందిస్తుంది. ప్రసూతి మరణాలకు ప్రధాన కారణాన్ని లక్ష్యంగా చేసుకొని పనిచేస్తున్నందుకు గర్వంగా ఉంది'' అని వివరిస్తారు జాహ్నవి.

ఆత్మ రక్షణ

ఆత్మవిశ్వాసమే అసలైన గురుదక్షిణ

రాజస్థాన్‌లోని ఒక గ్రామంలో దివ్యాంగురాలైన ఒక స్టూడెంట్ అత్యాచారానికి గురైన సంఘటన ఆశా సుమన్‌ను షాక్‌కు గురిచేసింది. స్కూలు, కాలేజీల్లో చదివే అమ్మాయిలకు ఆత్మరక్షణ విద్యలు నేర్పాలని ఆ సమయంలో సంకల్పించుకుంది ఆశ. దివ్యాంగులు, సాధారణ యువతులు 30 వేల మందికి పైగా ఆత్మరక్షణ విద్యలు నేర్పించిన ఉపాధ్యాయురాలు ఆశా సుమన్ గురించి...



తొమ్మిది సంవత్సరాల క్రితం రాజస్థాన్ అల్వార్ జిల్లాలోని ఖార్కర గ్రామంలో...

ఆరోజు స్కూల్‌కు వెళ్లింది ఆశా సుమన్. బడిలో మగపిల్లలు తప్ప ఆడపిల్లలు ఎవరూ కనిపించలేదు. ఆమెకు ఏమీ అర్థం కాలేదు. ఈ లోపే ఎవరో ఊళ్లో జరిగిన దుర్ఘటన గురించి చెప్పారు. దివ్యాంగురాలైన ఒక అమ్మాయి సామూహిక అత్యాచారానికి గురైంది. ఈ సంఘటనతో గ్రామం ఉలిక్కిపడింది.

విషయం తెలిసిన ఆశ హుటాహుటిన బాధితురాలి ఇంటికి వెళ్లింది. ఆ సంఘటనకు సంబంధించిన విషయాలు చెవిన పడుతున్నప్పుడు ఆమె మనసు దుఃఖసముద్రం అయింది.

ఈ సంఘటన ప్రభావంతో కొద్దిమంది తల్లిదండ్రులు అమ్మాయిలను స్కూల్‌కు పంపడం మాన్పించారు. నిజానికి ఆ ప్రాంతంలో ఆడపిల్లల చదువుకు అంతగా ప్రాధాన్యత ఇవ్వరు. ఇచ్చే వాళ్లు కూడా తమ ఇంటి ఆడపిల్లలను బడికి పంపడానికి భయపడుతున్నారు.

స్కూల్‌కు వెళ్లినా, స్కూల్ నుంచి ఇంటికి వచ్చినా ఆ పాశవిక సంఘటన, తల్లిదండ్రులపై దాని ప్రభావం పడి ఆడపిల్లలు స్కూల్‌కు దూరం కావడం... ఇవి పదే పదే గుర్తుకు వచ్చి ఆశను విపరీతంగా బాధపెట్టాయి.

'ఆ అమ్మాయికి తనను తాను రక్షించుకోవడం తెలిస్తే ఇలా జరిగేది కాదేమో. ఆడపిల్లలకు ఆత్మరక్షణ విద్య నేర్పాలి' అనుకుంది. మొదటి అడుగుగా... పిల్లల తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి వారితో మాట్లాడింది. పిల్లలను తిరిగి స్కూల్‌కు పంపించడానికి వారు మొదట్లో ససేమిరా అన్నారు. చదువు అనేది ఎంత అవసరమో వివరించి, అమ్మాయిలు తమను తాము కాపాడుకునే ఆత్మరక్షణ విద్యల గురించి చెప్పి వారిలో మార్పు తీసుకువచ్చింది.

కొన్ని రోజుల పాటు ప్రతి ఇంటికి వెళ్లి అమ్మాయిలను తన స్కూటర్‌పై స్కూల్‌కు తీసుకువచ్చేది.

రెండు నెలల తరువాత పరిస్థితి మామూలుగా మారింది.

స్కూల్‌లోని అమ్మాయిలకు ఆత్మరక్షణ విద్యలు నేర్పించడంతో పాటు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి చెప్పేది. ఆశ గురించి విన్న చుట్టుపక్కల ఊళ్లలోని స్కూల్, కాలేజీ వాళ్లు 'మా స్టూడెంట్స్‌కు కూడా నేర్పించండి' అంటూ ఆహ్వానించారు. కాదనకుండా వారి ఆహ్వానాన్ని మన్నించి ఎన్నో స్కూళ్లు, కాలేజీలలో ఎంతోమంది అమ్మాయిలకు ఆత్మరక్షణ విద్యలు నేర్పించింది.

వైకల్యం ఉన్న బాలికలకు ఆత్మరక్షణ విద్యలు నేర్పే విధానం వేరుగా ఉంటుంది, వారు సులభంగా అర్థం చేసుకునేలా, అర్థం చేసుకున్నది ఆచరణలో చేసేలా రోజువారి సంఘటనలను ఉదాహరిస్తూ, డమ్మీని ఉపయోగిస్తూ నేర్పిస్తుంటుంది. దృష్టిలోపం ఉన్న మోనిక అనే స్టూడెంట్ ఆశ టీచర్ దగ్గర సెల్ఫ్–డిఫెన్స్ టెక్నిక్స్ నేర్చుకుంది.


యువతులకు ఆత్మరక్షణలో శిక్షణ ఇస్తున్న ఆశా సుమన్

'నేను బయటికి ఎక్కడికి వెళ్లినా తోడుగా అన్నయ్య వచ్చేవాడు. అన్నయ్య లేకుంటే బయటకు వెళ్లడానికి సాహసించేదాన్ని కాదు. అయితే ఇప్పుడు నా గురించే నేనే కాదు, తల్లిదండ్రులు కూడా భయపడడం లేదు. ఎవరైనా నాకు చెడు చేయడానికి ముందుకు వస్తే నిమిషాల్లో మట్టి కరిపించగలననే నమ్మకం వచ్చింది' అంటుంది మోనిక.

స్టూడెంట్స్‌లోనే కాదు వారి తల్లిదండ్రులలోనూ ఇప్పుడు ఎంతో ధైర్యం వచ్చింది. 'చాలామందిలాగే నేను కూడా మా అమ్మాయిని స్కూల్‌కు పంపడానికి భయపడ్డాను. ఇప్పుడు అలాంటి భయాలేవీ లేవు. స్కూల్ అయిపోగానే అమ్మాయిల కోసం ఆశా టీచర్ నిర్వహిస్తున్న సెల్ఫ్–డిఫెన్స్ క్లాసులను దగ్గర నుంచి చూశాను. అమ్మాయిల్లో ఎంతో ఆత్మవిశ్వాసం కనిపించింది. ప్రతి స్కూల్లో ఆశలాంటి టీచర్ ఒకరు ఉండాలి' అంటున్నాడు ఆ ఊరికి చెందిన జస్వంత్.

అమ్మాయిలలో ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి ఆశ టీచర్ చేస్తున్న కృషికి ఎన్నో పురస్కారాలు లభించాయి. ఆత్మరక్షణ విద్యల వల్ల అమ్మాయిల్లో కనిపించే ఆత్మవిశ్వాసమే తనకు అసలు సిసలు గురుదక్షిణ అంటుంది ఆశా సుమన్.

సినిమా

మిలన్‌కు బై బై


● గోపీచంద్

మిలన్‌కు బై బై చెప్పారు గోపీచంద్. శ్రీను వైట్ల దర్శకత్వంలో గోపీచంద్ హీరోగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. వేణు దోనేపూడి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా తొలి షెడ్యూల్ ఇటలీలో మొదలైన విషయం గుర్తుండే ఉంటుంది. అక్కడి మిలన్ నగరంలో ప్లాన్ చేసిన షెడ్యూల్ ముగిసింది. గోపీచంద్‌తో పాటు ఇతర ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. అలాగే శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో ఓ పాటతో ఈ విదేశీ షెడ్యూల్ పూర్తయినట్లు చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్.

ప్రస్తుతానికి అందుబాటులో లేను!


● పూజా హెగ్డే

పుట్టినరోజు (అక్టోబర్ 13) సందర్భంగా పూజా హెగ్డే తన తాజా చిత్రం గురించి థ్రిల్లింగ్ న్యూస్ ఒకటి చెప్పారు. షాహిద్ కపూర్ సరసన తొలిసారి ఆమె కథానాయికగా నటించనున్నారు. యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని దర్శకుడు రోషన్ ఆండ్రూస్ తెరకెక్కించనున్నారు. ఇలా బర్త్ డేకి ఓ థ్రిల్లర్ మూవీకి సైన్ చేయడం పట్ల పూజా హెగ్డే ఆనందంగా ఉన్నారు. ''ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. ఎందుకంటే కథాంశం కొత్తగా ఉంది. అలాగే నాది చాలా విభిన్నమైన పాత్ర. షాహిద్ కపూర్‌తో స్క్రీన్ షేర్ చేసుకోనుండటం హ్యాపీగా ఉంది. తను మంచి నటుడు. అందుకే ఈ సినిమా ప్రయాణాన్ని ఆరంభించడానికి ఆసక్తిగా ఉన్నాను'' అని పేర్కొన్నారు పూజా హెగ్డే. ఇక పుట్టినరోజుని ఎలా జరుపుకున్నారంటే.. ప్రస్తుతం ఈ బ్యూటీ మాల్దీవుల్లో ఉన్నారు. 'కరెంట్లీ అన్ అవైలబుల్' (ప్రస్తుతం అందుబాటులో లేను) అంటూ మాల్దీవుల్లో సేద తీరుతున్న ఫొటోను సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు పూజా హెగ్డే.

వ్యక్తుల సంఘర్షణే వ్యూహం

– రామ్‌గోపాల్ వర్మ


● దాసరి కిరణ్ కుమార్, రామ్‌గోపాల్ వర్మ

''నాకు టీడీపీ గురించి తెలియదు. వైసీపీ గురించి తెలియదు. నేను రాజకీయాలు ఫాలో కాను. ఈ 'వ్యూహం' చిత్రానికి పార్టీలకు, ప్రభుత్వాలకు సంబంధం లేదు. ఇది కేవలం వ్యక్తుల మధ్య ఉండే కాన్‌ఫ్లిక్ట్ (సంఘర్షణ)'' అని దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ అన్నారు. అజ్మల్, మానస ప్రధాన పాత్రధారులుగా రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో రూపొందిన తాజా పొలిటికల్ చిత్రం 'వ్యూహం'. ఈ సినిమా రెండో భాగం 'శపథం'. రామదూత క్రియేషన్స్ పతాకంపై దాసరి కిరణ్ కుమార్ నిర్మించిన 'వ్యూహం' సినిమా నవంబరు 10న, 'శపథం' చిత్రం జనవరి 25న విడుదల కానున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన 'వ్యూహం' సినిమా ట్రైలర్ ఆవిష్కరణ వేడుకలో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ – ''వాస్తవ సంఘటనలు, వాటి తాలూకు పాత్రల పట్ల నాకు ఎప్పుడూ ఆసక్తి ఉంటూనే ఉంటుంది. నా దర్శకత్వంలో వచ్చిన సినిమాల్లో దాదాపు 80 శాతం వరకు ఏదో ఒక సంఘటన నుంచి స్ఫూర్తి పొందినవే ఉంటాయి'' అన్నారు. దాసరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ –''ప్రజలకు తెలియని ఎన్నో విషయాలు ఉంటాయి. ఆ అంశాలను పొందుపరిచి ఓ సందేశంగా.. సినిమాగా చెప్పాలనిపించి, సమయానుకూలంగా 'వ్యూహం'ని ఇప్పుడు నిర్మించి, విడుదల చేస్తున్నాం. ఇది బయోపిక్ కాదు. ఈ సినిమాని చాలా పెద్ద స్థాయిలో రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. ఐదు లక్షల మందితో నవంబరు 5న ప్రీ రిలీజ్ వేడుకను భారీ ఎత్తున జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు.

ఆమిర్‌కు జోడీగా?


● జెనీలియా

'సై', 'బొమ్మరిల్లు', 'ఆరెంజ్' వంటి చిత్రాలతో హీరోయిన్‌గా జెనీలియా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే. రితేష్ దేశ్‌ముఖ్‌ని పెళ్లి చేసుకుని, ఇద్దరు బిడ్డలకు తల్లయిన జెనీలియా చాలా గ్యాప్ తర్వాత మళ్లీ సినిమాలు ఒప్పుకుంటున్నారు. ఈ క్రమంలో ఆమిర్ ఖాన్‌కు జోడీగా ఆమె ఓ సినిమాలో ఎంపికయ్యారని బాలీవుడ్ టాక్. ఆమిర్ ఖాన్ తాజా చిత్రం 'సితారే జమీన్ పర్' చిత్రంలో హీరోయిన్ పాత్రకు జెనీలియాను తీసుకున్నారని, ఆర్ఎస్ ప్రసన్న ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తారని సమాచారం. మరి.. ఆమిర్‌కు జోడీగా జెనీలియా కనిపిస్తారా? చూడాలి. మరోవైపు దశాబ్దం తర్వాత 'జూనియర్' అనే తెలుగు సినిమాలో జెనీలియా కీలక పాత్ర చేస్తున్నారు. ఇక 2012లో రానా హీరోగా వచ్చిన 'నా ఇష్టం' తెలుగులో హీరోయిన్‌గా జెనీలియా నటించిన చివరి చిత్రం.

"నటనకు కావాలని విరామం ఇవ్వలేదు. నాకు నటించాలనే ఉంది. అయితే ఓ సినిమా ఒప్పుకునే ముందు కథ, అందులోని నా పాత్ర, ఆ చిత్ర దర్శక-నిర్మాతలు... ఈ మూడు అంశాలను పరిగణనలోకి తీసుకుంటాను. ఇలా ఈ మూడు అంశాలతో నేను ఏకీభవించి నటించిన చిత్రం 'టైగర్ నాగేశ్వర రావు'" అన్నారు నటి, దర్శక-నిర్మాత రేణూ దేశాయ్. రవితేజ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'టైగర్ నాగేశ్వర రావు'. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో మయాంక్ సింఘానియా సహనిర్మాతగా అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో రేణూ దేశాయ్ చెప్పిన విశేషాలు.

వయసుకి తగ్గ పాత్రలే చేస్తాను

– రేణూ దేశాయ్


● 'టైగర్...'లో హేమలతగా రేణు

● 'టైగర్ నాగేశ్వర రావు'లో హేమలత లవణంగారి పాత్ర చేశాను. లవణంగారి మేనకోడలు కీర్తిగారిని కలిసి ఆవిడ గురించి చాలా విషయాలు తెలుసుకున్నాను. 1970 కాలంలోనే జోగిని వ్యవస్థ, అంటరానితనంపై పోరాటాలు చేశారామె. దొంగలు, బందిపోట్లలో మంచి మార్పు కోసం కృషి చేశారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలతో స్ఫూర్తిగా నిలిచిన హేమలతగారి పాత్ర చేయడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఆమె బాడీ లాంగ్వేజ్‌ను వెండితెరపై ప్రతిబింబించడం సవాల్‌గా అనిపించింది. నా కెరీర్‌లో ఇప్పటివరకూ నాకు ఏ పశ్చాత్తాపం లేదు. అయితే హేమలత లవణంగారి గురించి తెలుసుకుని, ఆమె పాత్రలో నటించిన తర్వాత ఆమెను కలవలేకపోయానని పశ్చాత్తాపపడుతున్నాను. హేమలతగారి స్ఫూర్తితో చిన్నారుల ఆకలి తీరేలా నా వంతుగా ఓ స్వచ్ఛంద సేవా సంస్థను మొదలు పెట్టాలనుకుంటున్నాను. 'టైగర్ నాగేశ్వర రావు' సినిమా ట్రైలర్ చూసి, నా వయసుకి తగ్గ పాత్రలో నటించినందుకు మా అమ్మాయి ఆద్య తనకు గర్వంగా ఉన్నట్లు చెప్పింది. నాకు బెస్ట్ కాంప్లిమెంట్ అది. నా గురించి నా పిల్లలు ఏమనుకుంటున్నారన్నదే నాకు ముఖ్యం. భవిష్యత్‌లో నా వయసుకు తగ్గ పాత్రలే చేయాలనుకుంటున్నాను. ● మా నాన్నమ్మ 47 ఏళ్లకే హార్ట్ ఎటాక్‌తో చనిపోయారు. మా నాన్నా హార్ట్ ఎటాక్‌తోనే చనిపోయారు. ఇలా జన్యుపరంగా నాకు గుండె సంబంధిత సమస్యలున్నాయి. అయితే ప్రమాదం లేదు. అలాగని అజాగ్రత్త వహించకూడదు. చికిత్స తీసుకుంటున్నాను.

మార్పు రావాలి


● తాప్సీ

కథానాయికగా సౌత్, నార్త్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు తాప్సీ. అయితే హీరోయిన్‌గా మిగిలిపోకుండా నిర్మాతగానూ నిరూపించుకోవాలనుకున్నారామె. తొలి ప్రయత్నంగా తాప్సీ నిర్మించిన హిందీ చిత్రం 'ధక్ ధక్' శుక్రవారం విడుదలైంది. అయితే నిర్మాతగా తనకు చేదు అనుభవం ఎదురైందని తాప్సీ అంటున్నారు. ఓ ఇంటర్వ్యూలో తాప్సీ మాట్లాడుతూ – ''బాలీవుడ్‌లో స్టార్ సిస్టమ్ వల్ల చిన్న సినిమాలకు నష్టం జరుగుతోంది. కథ వినేటప్పుడే 'హీరో ఎవరు?' అని అడుగుతున్నారు. దాంతో జనాలు 'కంటెంటే కింగ్' అనుకుంటారనే నా భ్రమ తొలగిపోయింది. హీరోని బట్టి పెట్టుబడి ఉంటుంది. ఓ నటిగా నేను ఒక కథ వినేటప్పుడు ఆ నిర్మాతలు ఎంత పెద్దవాళ్లు, కో–స్టార్ ఎవరు? అని అడగలేదు. కొత్త దర్శకులతో, కొత్త నటులతో సినిమాలు చేశాను. కానీ వేరేవాళ్లు అలా చేయడానికి ఇష్టపడటంలేదు. ఎందుకీ తేడా? ఈ విషయంలో ఏ ఒక్కర్నో నిందించాల్సిన అవసరం లేదు. యాక్టర్లు, స్టూడియోలు, ప్రేక్షకులు... అందరూ బాధ్యులే. బాలీవుడ్ అర్థవంతమైన చిత్రాలు చేయడంలేదని అంటుంటారు. కానీ, చేసినప్పుడు మాత్రం సపోర్ట్ దక్కదు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలి. పెద్ద సినిమాలకు పెట్టుబడి పెట్టి, డిజిటల్ రైట్స్ ద్వారా డబ్బు రికవర్ చేసుకోవచ్చని అనుకుంటారు. చిన్న సినిమాలకు పెట్టుబడి పెట్టడం కష్టం.. రిలీజ్ చేసుకోవడమూ కష్టమే. ఈ పరిస్థితి స్టార్స్‌కి, యాక్టర్స్‌కి మధ్య దూరం పెంచుతుంది'' అని చెప్పుకొచ్చారు. ఇక తాప్సీ ఒక నిర్మాతగా వ్యవహరించిన 'ధక్ ధక్' కథ నలుగురు మహిళల చుట్టూ తిరుగుతుంది.

బంజారా నేపథ్యంలో...


● మల్లారెడ్డి, రాకేష్

తెలంగాణ ప్రాంతం బంజారా (తండా) నేపథ్యంలో రూపొందుతున్న సినిమాకు 'కెసిఆర్' (కేశవ్ చంద్ర రమావత్) అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'రాకింగ్' రాకేష్, అనన్య హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా చేస్తూనే, దర్శకత్వం వహిస్తున్నారు 'గరుడ వేగ' అంజి. గ్రీన్ టీ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో విభూది క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను తెలంగాణ మంత్రి మల్లారెడ్డి విడుదల చేశారు. మల్లారెడ్డి యూనివర్సిటీలో 50 అడుగుల కటౌట్‌తో 50,000 మంది స్టూడెంట్స్ సమక్షంలో జరిగిన 'కెసిఆర్' టైటిల్ లాంచ్ ఈవెంట్‌లో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. మామిడి హరికృష్ణతో పాటు 'కెసిఆర్' చిత్రబృందం పాల్గొంది. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్.

గోవాలో సంతోషం


● సురేష్ కొండేటి

సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డుల వేడుక డిసెంబరు 2న గోవాలో జరగనుంది. సంతోషం 22వ 'సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డులు–2023' వేడుక గోవాలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో జరగనున్నట్లు, జాతీయ సినిమా దినోత్సవం సందర్భంగా శుక్రవారం హీరోయిన్ శ్రీలీల ఓ వీడియోలో వెల్లడించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ మరియు బాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు ఈ వేడుకకు హాజరు కానున్నట్లు నిర్వాహకుడు, 'సంతోషం' పత్రికాధినేత సురేష్ కొండేటి పేర్కొన్నారు.

మాస్ స్టెప్స్‌తో..


● కంచర్ల ఉపేంద్ర

కంచర్ల ఉపేంద్ర, సావిత్రి కృష్ణ జంటగా ఎస్‌కే ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో కంచర్ల అచ్యుతరావు నిర్మిస్తున్న చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. 'పోకిరీ జులాయిలు...' అంటూ సాగే పాటను చిత్రీకరిస్తున్నారు. కంచర్ల ఉపేంద్ర, వంద మంది జూనియర్ ఆర్టిస్టులు, ఇరవై మంది డ్యాన్సర్లు పాల్గొంటుండగా ఈ మాస్ పాటను చిత్రీకరిస్తున్నారు. ఊటీలో చిత్రీకరించే మరో పాటతో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. ''హీరో కావాలన్న మా అబ్బాయి ఆసక్తిని గమనించి, ఐదు చిత్రాలు నిర్మిస్తున్నాం'' అన్నారు కంచర్ల అచ్యుతరావు. ఈ చిత్రానికి సంగీతం: రాము అద్దంకి.